ప్రజాశక్తి
మంగళవారం 13 జూన్ 2023
5
అనంతపురం

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి కోరారు. సోమవారం నాడు స్పందన కార్యక్రమం అనంతరం జాయింట్ కలెక్టర్ చేతన్‌తో కలిసి ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని చైల్డ్‌లైన్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన చైతన్య అవగాహన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణాపై విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మండల, డివిజన్ జిల్లా స్థాయిలో రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం, కార్మిక, పోలీసు, విద్యాశాఖలు, స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతగా భాగస్వాములై ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా బాల కార్మికులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే 1098 లేదా పోలీసు హెల్ప్‌లైన్ 100, 112 ఉమెన్స్ హెల్ప్ లైన్ 181కు తెలియజేయాలని సూచించారు. బడి బయట పిల్లలను గుర్తించి వారిని విధిగా బడిలో చేర్పించేలా సచివాలయ, విద్యాశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బాల కార్మిక రహిత జిల్లాగా చేసేందుకు కషి చేద్దామని రెవెన్యూ భవన్లో అధికారులచే కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి శ్రీదేవి, జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ రఘురాములు, బాలల సంరక్షణ అధికారి సుబ్రమణ్యం, రెడ్స్ భానుజా, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు : కలెక్టర్

అనంతపురం జిల్లాలోని 41 గ్రామ వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సర్వీసు సేవలు ప్రారంభం అయ్యాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం రెవెన్యూ భవన్‌లో రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రజల ముంగిట రిజిస్ట్రేషన్ సేవలపై ప్రచార నిమిత్తం ముద్రించిన గోడపత్రికలు, బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ప్రస్తుతం ప్రజలకు చేరువగా గ్రామ స్థాయి సచివాలయాల నుంచి రిజిస్ట్రేషన్ సర్వీసులు పొందవచ్చునని తెలిపారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్ అన్ని రకముల దస్తావేజులు (ఇంటి స్థలం, వ్యవసాయ భూములు, వీలు నామాలు దత్తత మొదలైనవి) రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు చెప్పారు. ఈసీ, నకలు మార్కెట్ విలువల సహాయం, వివాహాల రిజిస్ట్రేషన్ లాంటి సేవలు పొందవచ్చునని తెలిపారు. ఆయా సచివాలయ ప్రాంత ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, వీఆర్వో గాయత్రి దేవి, ఆర్డీవో మధుసూదన్, జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం, శివ నారాయణ, రిషికేష్ పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత పాటించాలి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని మోరేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చిక్కీ, పీనట్ ఆహార ఉత్పత్తుల యూనిట్‌ను సోమవారం మంత్రి ఉషశ్రీచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన చిక్కీ, పీనట్ ఉత్పత్తుల్లో నాణ్యత పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి వెంట ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు ఉన్నారు.

మరో విద్యుత్ పోరాటం తప్పదు

◆ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి
◆ అసలు కంటే కొసరు ఛార్జీలు అధికం
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో ప్రజలపై ఎడాపెడా ఛార్జీల భారాన్ని మోపుతున్నాయని, వీటిని తగ్గించకుంటే మరో విద్యుత్ పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హెచ్చరించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉప సంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం అనంతపురం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో పాతూరు పవర్ ఆఫీస్ వద్ద సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో విద్యుత్ ఛార్జీలను పెంచి దోపిడీ చేస్తున్నాయన్నారు. సర్దుబాటు చార్జీలంటూ రూ.వేల కోట్ల భారాలు మోపుతున్నాయని మండిపడ్డారు. నెలనెలా వస్తున్న కరెంటు బిల్లులు చూస్తే షాక్‌కు గురయ్యేలా ఉన్నాయన్నారు. గత సంవత్సరం విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.1400 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మోపిందన్నారు. ఇష్టానుసారం స్లాబులు మార్చేశారని తెలిపారు. ఈ నెల బిల్లులో 2014 సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్లీ యూనిట్‌పై రూ.20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్ యూనిట్‌కు మరో రూ.20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో ఉపయోగించిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.40 పైసలు కలిపి మొత్తం యూనిట్‌కు 80 పైసలు చొప్పున భారం మోపారని తెలిపారు. మోదీ ప్రభుత్వం ఆదేశాలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లొంగిపోయిందన్నారు. ప్రతి నెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చేశారని తెలిపారు. కరెంట్‌కి బిల్లులే కాకుండా ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారని తెలిపారు. అసలు ఛార్జీల కంటే కొసరు ఛార్జీలు అధికం అవుతున్నాయని విమర్శించారు. కేంద్రం విద్యుత్ రంగాన్ని అదానీ తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 30 సంవత్సరాల పాటు వ్యవసాయానికి అందించే విద్యుత్ మొత్తం తయారు చేసే ఒప్పందం అదానీ చేయించేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీ అదానీ ప్రారంభించారని తెలిపారు. ఇలా విద్యుత్ రంగం మొత్తం అదానీ, కార్పొరేట్‌ల గుప్పెట్లోకి వెళ్లిపోతుందన్నారు. 200 యూనిట్‌ల లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్లలో అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. చిరు వ్యాపారులకు విపరీతంగా రేట్లు పెంచేశారన్నారు. మున్సిపాలిటీలు వినియోగించే విద్యుత్ బిల్లులు పరోక్షంగా ప్రజలపై భారం పడుతుందన్నారు. వ్యాపార సంస్థలు, పరిశ్రమలపై భారం పెరిగి అవి అంతిమంగా ప్రజలపైనే పడుతుందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణల పేరుతో ఛార్జీలు పెంచితే ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. పెంచిన ఛార్జీలను తగ్గించాలని కమ్యూనిస్టులు ప్రాణాత్యాగాలు చేసి పోరాడారన్నారు. ప్రస్తుతం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా మరో ఉద్యమం జరగక ముందే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ముస్కిన్, వై.వెంకటనారాయణ, నగర నాయకులు వలీ, ప్రకాష్, మసూద్, ప్రసాద్, శ్రీనివాసులు, రాజు, లక్ష్మినారాయణ, గఫూర్, మహ్మద్, శివ, ఇస్మాయిల్, బీబి తదితరులు పాల్గొన్నారు.

14న 'అమ్మ డెయిరీ' ప్రారంభం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సొంత నిధులు రూ.20కోట్లతో రోజుకు 1.20లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ (అమ్మ డెయిరీ)ని ఈనెల 14న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా పాడి రైతుల ఆర్థికాభావృద్ధి సాధించాలనే మంచి ఉద్దేశంతో డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లుగా కోవిడ్ లాంటి ఎన్నో అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆలస్యమైనా ఎట్టకేలకూ దాతల సహకారంతో డెయిరీని నిర్మించామన్నారు. డెయిరీ సేవలు విస్తృతస్థాయిలో జిల్లా అంతటా ఉపయోగపడాలనే ఉద్దేశంతో అనంతపురం మిల్క్ అసోసియేషన్ (అమ్మ) అనే నామకరణం చేశామన్నారు. ఇందులో 10 వేల మంది అమ్మలు నడిపే 'అమ్మ డెయిరీ'లో ఉత్పత్తి అయ్యే పాలు అమ్మ పాలంత శ్రేష్టం, నాణ్యతగా ఉంటాయన్నారు. ఇందులో పెట్టుబడుదారులు, వ్యాపారులు లేరని, మహిళా రైతులే కూలీలు, వారే యజమానులు అన్నారు. రాజశేఖర్‌రెడ్డి తెలంగాణలోని ములకనూరు డెయిరీని రెండు సందర్భాల్లో సందర్శించారన్నారు. అలాంటి డెయిరీని పులివెందులలో మహిళల కోసం ఏర్పాటు చేయాలని ఆలోచించారన్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతం నుంచి పలువురు మహిళా పాడి రైతులు ములకనూరు వెళ్లి అక్కడి డెయిరీని చూసి వచ్చారు. దురదృష్టవశాత్తూ పెద్దాయన అకాల మరణం చెందారు. ఆయన ఆశయాన్ని నిలబెట్టాలనే ఉద్దేశంతో తాను, ఎంపి రంగయ్యతో కలిసి ములకనూరు డెయిరీని సందర్శించి సభ్యులతో మాట్లాడామన్నారు. తర్వాత బస్సుల్లో వందమంది మహిళా రైతులను పిలుచుకెళ్లి చూపించామన్నారు. అనంతరం ఏ ఒక్క రూపాయి మహిళలపై భారం పడకుండా దాతల సహకారం, తోపుదుర్తి కుటుంబం తన సొంత నిధులతో డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభానికి ముఖ్య అతిథులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, విశిష్ట అతిథులుగా డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్ గౌతమిరెడ్డి, ఎస్‌పి శ్రీనివాసరావు, అతిథులుగా ఉమ్మడి జిల్లాలోని నాతోటి శాసనసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైసిపి నాయకులు ధనుంజయయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తరిమెలలో మహిళ ఆత్మహత్య

నెలరోజుల క్రితం కుమారుడు ఆత్మహత్యాయత్నం
పోలీసుల తీరుపై కుటుంబ సభ్యుల ఆగ్రహం
మృతదేహంతో గ్రామంలో నిరసన

ప్రజాశక్తి-శింగనమల

ఎదురెదురుగా నివసిస్తున్న రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. పోలీసులు ఒక వైపు వారికి వత్తాసు పలుకుతూ వారి పక్షాన మాట్లాడి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆవేదనతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. ఇదే విషయంపై ఈమె కుమారుడు గత నెల 23వ తేదీన ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఆయన కోలుకున్నాడు. ఇది జరిగిన దాదాపు 20 రోజులకు మళ్లీ ఆ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సారి కూడా పోలీసులు ఒకరివైపు మాట్లాడి తమను ఇబ్బందులకు గురి చేస్తారన్న భయంతో ఏకంగా ఆ మహిళ సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. శింగనమల మండలం తరిమెల గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. పోలీసుల వైఖరి వల్ల మహిళ చనిపోయిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు మహిళ మృతదేహంతో సాయంత్రం వరకు ఆందోళన నిర్వహించారు. చివరికి అనంతపురం డీఎస్పీ శివారెడ్డి హామీతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి....

తరిమెల గ్రామానికి చెందిన దంపతులు వెంకటేష్, లక్ష్మిదేవి(60) ఇంటికి ఎదురుగా గంపమల్లయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య తరచూ గొడలు జరుగుతుండేవి. గత నెల 23న ఇంటి ముందు నీరు పారే విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు విచారణ నిమిత్తం రాజేష్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేషన్‌లో తనను అకారణంగా కొట్టారని ఆరోపిస్తూ రాజేష్ సూపర్‌వాస్మోయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స అనంతరం ఇతను కోలుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ రెండు కుటుంబాల మధ్య ఆదివారం సాయంత్రం మరోసారి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గంపమల్లయ్య కుటుంబ సభ్యులు తమను చంపుతామని బెదిరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ సారి కూడా పోలీసులు తమకు న్యాయం చేయరని భావించిన లక్ష్మిదేవి ఆదివారం రాత్రి తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. సోమవారం ఉదయం నిద్రలేవగానే ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఊరి చివరకు వెళ్లి సూపర్ వాస్మోయిల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మిదేవి ఇంట్లో కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. గ్రామ చివరిలోని ఓ పొలం వద్ద లక్ష్మిదేవిని గుర్తించారు. అక్కడికెళ్లి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు.

మహిళ మృతదేహంతో ఆందోళన... డీఎస్పీ హామీతో విరమణ

లక్ష్మిదేవి మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు ఆందోళన కొనసాగింది. విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ శివారెడ్డి సిబ్బందితో కలిసి తరిమెల గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గత ఎస్ఐ తమపై కక్షతో వ్యవహరించడం వల్లే ఈ ఘటన జరిగిందని, ఆ ఎస్‌ఐను గ్రామానికి పిలిపించాలని డిమాండ్ చేశారు. అంత వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని, పోలీసులకు సహకరించాలని కోరారు. సాయంత్రం 7 గంటల వరకు పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం గ్రామ పెద్దలు, పోలీసుల సూచన మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని డీఎస్పీ తెలియజేశారు.

మృతదేహంతో ఆందోళన చేస్తున్న లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో లక్ష్మీదేవి పాతచిత్రం)

ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ఉరవకొండ : ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో కొన్ని ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.వేలకువేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల పీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను దుకాణాల్లో సరుకుల్లాగా కిలోల ప్రకారం అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఘోరంగా వైఫల్యం చెందారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ తదితర స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని, బయట కొనుగోలు చేసిన పుస్తకాలు తమ పాఠశాలల్లో ఉపయోగపడవని, రూ.5 వేల నుంచి రూ.8 వేలకుపైగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు 25 శాతం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తు వదిలి ప్రభుత్వ నిబంధనలను అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

'స్పందన' అర్జీలకు పరిష్కారం చూపాలి : ఎస్పీ

అనంతపురం : స్పందన పిటీషన్లకు నిర్దేశిత సమయంలోగా పరిష్కారం చూపాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 119 పిటీషన్లు స్వీకరించారు. ఇందులో భాగంగా జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన పిటీషనర్‌తో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో పిటీషనర్లను మాట్లాడించారు. చట్టపరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్‌బి సిఐ ఇందిర, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై వేసిన విద్యుత్ ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తిలక్‌నగర్‌లో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ అధ్వర్యంలో పర్యటించి విద్యుత్ ఛార్జీల పెంపుదలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచిన కరెంటు బిల్లులలపై పేదలు నాయకుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంట్లో ఒక బల్బ్, ఒక ఫ్యాన్ ఉంటే గతంలో రూ.వంద నుంచి రూ.150 వరకూ వచ్చేదని, ఇప్పుడు రూ.500 నుంచి రూ.600 వరకూ వస్తోందని వాపోయారు. పూలు, కాయగూరలు, చిన్నచిన్న వ్యాపారం చేసుకునే తాము ఇంతింత కరెంటు బిల్లు వస్తే ఎలా కట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్ వివిధ పథకాల పేరుతో అరకొర డబ్బులను చేతికి ఇచ్చి వేలకు వేలు గుంజుకుంటున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరెంటు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, ట్రు-ఆఫ్ ఛార్జీల వసూళ్లు నిలిపి వేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా విద్యుత్తు ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు బి.చంద్రశేఖర్, ఎస్.అబ్దుల్లా, షబ్బీర్, రామునాయక్, సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల పెంపు వివరాలను తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ఉద్యోగుల భద్రతకు పెద్దపీట : విప్ కాపు

రాయదుర్గం : ఉద్యోగుల భద్రతకు వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలోనే సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసిన నేపథ్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మురళి ఆధ్వర్యంలో క్రమబద్ధీకరించిన ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే కాపు రామచంద్రారెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ అర్హులై క్రమబద్ధీకరించని ఉద్యోగులు ఎవరైనా ఉంటే తెలిపితే సీఎం జగన్ నా దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రమబద్ధీకరణ ద్వారా 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు లబ్ధి పొందారని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, గౌని ఉపేంద్రరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు మాధవరెడ్డి, ముస్తాక్, అధ్యాపకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే బీసీల సాధికారత

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే బీసీల సాధికారత సాధ్యమని మాజీ జడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కష్ణయ్య అధ్యక్షతన బీసీ పార్లమెంట్ స్థాయి సాధికార సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాజకీయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ శాతాన్ని తగ్గించారన్నారు. తద్వారా బిసిలు రాజ్యాంగబద్ధ పదవులకు దూరమయ్యారన్నారు. అంతేగాకుండా ఆదరణ పనిముట్లు, సబ్సిడీ రుణాలను దూరం చేశారన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కార్పొరేషన్ కేవలం అప్పు తెచ్చుకోవడానికి తప్ప బీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలకు నిధులు మళ్లించడం ద్వారా బీసీల సంక్షేమం అటకెక్కిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే 'బీసీలకు రక్షణ చట్టాన్ని' తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, జోనల్ కోఆర్డినేటర్ జెరిపిటి నరసింహులు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కురుగుంట బ్రహ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, గాండ్ల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ విశాలాక్షి, కురుబ సాధికారత రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, శాలివాహన రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, నగర బీసీ సెల్ అధ్యక్షులు సిమెంట్ పోలన్న వాల్మీకి ప్రతాప్‌నాయుడు, కొయ్యగూర పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సచివాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి-బెలుగుప్ప

తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని స్వచ్ఛభారత్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మికులు బఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వేతనాలు చెల్లించడంతో మాత్రం నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. 9 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు పెండింగ్ వేతనాలతోపాటు నెలనెలా తప్పకుండా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ జిఎస్ రామచంద్ర ఆందోళనకారుల వద్దకు చేరుకుని చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు నారాయణస్వామి, ఉమాపతి, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, ఈరన్న, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

'విద్యాకానుక' పంపిణీలో విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణా లు, సౌకర్యాలు కల్పించినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణం లోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలు గేళ్లలో విద్యా రంగా నికి ప్రభుత్వం రూ. 60 వేల కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. సీఎం జగన్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారే కానీ ఓట్ల రాజకీయం చేయడం లేదన్నారు. గతంలో విద్యార్థులు పాఠ్య పుస్తకాలు కొని చదివే వారన్నారు. వైసిపి ప్రభుత్వం పాఠ్య, నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, డిక్షనరీ, మూడు జతల దుస్తులు, బూట్లు, సాక్సులు, బ్యాగులు, ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపా రు. అలాగే అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, తదితర పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎంఈఓ నాగమణి మాట్లాడుతూ రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు ప్రభుత్వం విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హెచ్ఎం జయప్రద అధ్యక్షత వహించగా పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు సబీరాబి, డిష్ గోవింద, ఫకృద్దీన్, గోవిందరాజులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాజగోపాల్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్: మండల పరిధిలోని 43 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ తిమ్మప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు జడ్పీ హైస్కూల్‌లో 30%, ఎలిమెంటరీ స్కూల్‌లో 35 శాతం హాజరు నమోదైందని తెలిపారు. అనంతరం అన్ని పాఠశాల్లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయు లను దుశ్శాలువాలతో సన్మానించారు. ఉద్దేహాల్ హైస్కూల్‌లో వైసిపి మండల కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి కిట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు, స్కూల్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గుత్తిలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న అధ్యాపకులు, నాయకులు

రాయదుర్గంలో విద్యాకానుక అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్ : విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా సిఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. సోమవారం నగరంలోని అరవింద్ నగర్‌లో ఉన్న ఎస్‌కెడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం జగనన్న ప్రవేశపెట్టిన పథకాల వల్ల ఎంతోమంది పేద తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్యను చదివిస్తున్నారన్నారు. జగన్ తీసుకొచ్చిన పథకాల్లో జగనన్న విద్యాకానుక అతి ముఖ్యమైందన్నారు. విద్యా కానుక కిట్లలో మూడు జతల యూనిఫారాలు (క్లాత్), ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక సెట్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌తోపాటు ఆఖరికి యూనిఫాం కుట్టించుకునేందుకు కూడా మూడు జతలకి రూ.120 చొప్పున తల్లుల అకౌంట్‌కే నేరుగా డబ్బులు జమ చేస్తున్నారన్నారు. దీనికితోడు నాడు- నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, గోరుముద్దలు పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. వీటన్నింటినీ పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, డిఇఒ సాయిరాం, ఎంఇఒ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయుడు శ్యాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, మండల విద్యాధికారి బి.రవినాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి పుష్పావతి, వైసీపీ నాయకుడు షఫీ, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొత్తపేట గ్రామంలోని పాఠశాలలో జగనన్న విద్యాకానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆర్.గురుమస్తాన్, వైసిపి నాయకులు ఎస్.రాముయాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో విద్యాకానుక తీసుకున్న విద్యార్థులతో నాయకులు

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎఇఒ కృష్ణయ్య, హెచ్ఎం నవీద ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయినీలు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆస్మ ఆధ్వర్యంలో సోమవారం జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ శ్రీదేవి, సర్పంచి బాబు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు జగనన్న కిట్లు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

పుట్లూరులో విద్యాకానుక తీసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు, నాయకులు

డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని వినతి

పుట్లూరు : మండల కేంద్రంలో పదేళ్ల క్రితం రూ.కోటితో ప్రారంభించిన డిగ్రీ కళాశాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా బడుగు, బలహీన వారితోపాటు చిన్న, సన్న కారు రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అలాంటి కుటుంబాల నుంచి వస్తున్న విద్యార్థులు మండలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో చదువులకు దూరం అవుతున్నారన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామంజి, సూరి, వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, పూలరంగడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం : రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారే కానీ ప్రభుత్వ ఉద్యోగికి వర్తించే సౌకర్యాలు కల్పించలేదన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఇచ్చిన పీఆర్సీ వల్ల బేసిక్ వేతనంలో సుమారు 1.6 శాతం జీతం తగ్గిందని కార్మికులు వాపోతున్నారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల కార్మికులకు కొత్తగా ఒరిగిందేమి లేదన్నారు. దీనికితోడు సౌకర్యాల్లో కూడా కోత పెట్టారన్నారు. గతంలో రెఫరల్ ఆసుపత్రిలో ఆన్ లిమిటెడ్ మొత్తంలో వైద్య సదుపాయాలు ఉండేవని ఇప్పుడు ఇహెచ్ఎస్ కార్డుతో వైద్యం చేయించుకుని రీయింబర్స్‌మెంట్ పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే తాము ఒపిఎస్ కిందికి వస్తామో.. సిపిఎస్ కిందికి వస్తామో, జిపిఎస్ కిందికి వస్తామో తెలియడం లేదని అంటున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు న్యాయం చేసే బాధ్యత చంద్రబాబు, నారా లోకేష్ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

రైతులకు పంట నష్టపరిహారం మంజూరు

నార్పల : మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరైనట్లు మండల ఉద్యానవన అధికారిణి ఫజులున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 668.43 హెక్టార్లలో 831 మంది రైతులు అరటి పంట నష్టపోగా రూ.1.67 కోట్లు, 4.49 హెక్టార్లలో బొప్పాయి పంట నష్టపోయిన నలుగురు రైతులకు రూ.67,350, 14.95 హెక్టార్లలో టమోటా సాగుచేసిన 17 మంది రైతులకు రూ.22.4 లక్షలు, 0.4 ఎకరాల్లో కలింగర పంట నష్టపోయిన రైతుకు రూ.6వేలు, 0.58 హెక్టార్లలో లిల్లీ పూలు సాగు చేసిన ఇద్దరు రైతులకు రూ.8,700, 1.42 హెక్టార్లలో చామంతి పూలు సాగు చేసిన ముగ్గురు రైతులకు రూ.21,300 మంజూరైనట్లు తెలిపారు. మండలంలో క్రాప్ బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకూ నష్టపరిహారం మంజూరైనట్లు తెలిపారు.

జెఎన్‌టియు అధ్యాపకులకు సిఎఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఎఎస్) కింద ఉపకులపతి రంగజనార్ధన అధ్యతన సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతికై కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం క్రింద ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, డిఎపి వి.సుమలత, ఇంటర్వ్యూల ప్యానల్స్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1158 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు స్పిక్ ఫర్టిలైజర్ కంపెనీకి చెందిన 1158 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ రవి తెలిపారు. ఈమేరకు సోమవారం నగరం సమీపంలోని ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న రైల్వేస్టేషన్ స్టాక్ పాయింట్ వద్ద ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చేరిన ఎరువుల్లో యూరియా 332.25 మెట్రిక్ టన్నులు, డిఎపి 598.85 మెట్రిక్ టన్నులు, 20.20.0.13 ఎరువులు 173.4 మెట్రిక్ టన్నులు, ఎస్.ఎస్.పి ఎరువులు 53.85 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, సిరుగుప్ప ఆగ్రో ఏజెన్సీ హోల్‌సేల్ డీలర్ సిరుగుప్ప వెంకటేశ్వర్లు, స్పిక్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్ఎంలు బాధ్యతల స్వీకరణ

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కల్లూరు విజయలక్ష్మి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి జెడ్పీ పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. ఈమె గతంలో ఇదే మండలంలోని ఎల్లుట్ల హెచ్ఎంగా విధులు నిర్వహించారు. కాగా పుట్లూరు హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ బదిలీపై సజ్జలదిన్నెకు వెళ్లారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా శ్రీనివాస్ ప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కూడేరు జడ్పీ పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. ఆత్మకూరు హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న రాఘవయ్య బదిలీపై శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి బోధన చేయడమే తమ లక్ష్యమన్నారు.

బుక్కరాయసముద్రం సిఐగా నాగార్జునరెడ్డి

బుక్కరాయసముద్రం : మండల నూతన సిఐగా నాగార్జునరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా తిరుపతి డిటిఆర్‌బిలో పని చేస్తున్న నాగార్జునరెడ్డిని ఉన్నతాధికారులు బుక్కరాయసముద్రానికి బదిలీ చేశారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. గ్రామాల్లో పేకాట, మట్కా, బెట్టింగ్‌తోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. అలా తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

IN THE COURT OF THE
P.S.C.J AT BALLARI.
O.S. No. 57/2021

Between:
Smt. Sunkamma & another. ...Plaintiffs
And
Sri. V. C. Hanumanthappa & others. ...Defendants

To,
2) Nagi Reddy son of Late Challa Eranna, aged about 70 years, R/o Ward No. 30, Vaddara Geri, Urvakonda, Anantapur District, A. P.State.

SUMMONS

WHEREAS, the Plaintiff above named has instituted a suit against you for Partition and separate possession of the suit schedule property.

You are hereby summoned to appear in this Court in person or by an Advocate duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions, on the day 28 of 06, 2023 at 11-00 'O' Clock in the forenoon, to answer the claim (And further you are hereby directed to file on that day a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense or claim for set off or counter claim, and where you rely on any other document whether in possession or power or not, as evidence in support of your defense or claim or set - off or counter claim you shall enter such documents in a list to be examined to the written statement.

Take notice that, in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

Given under my hand and seal of the court, this 12 day 06 of 2023.

By order of the court
(R.HULIRAJA)
Advocate for the Plaintiff
Shirestedar
Prl Senior Civil Judge at Ballari.

ఉద్యోగాలకు 28 మంది ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో పివికెకె సిబ్బంది

స్థానిక రుద్రంపేటలో ఉన్న పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో కియా అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 28 మంది ఎంపికయ్యారు. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్లు తెలిపారు. దీంతోపాటు అనేక దేశ విదేశ ప్రఖాత సంస్థలతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఆయా సంస్థలకు కావాల్సిన నైపుణ్యాలను సైతం ఆయా సంస్థల ప్రతినిధులతోనే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. దానివల్ల ప్రాంగణ నియామకాల్లో అగ్రగామిగా నిలుస్తున్నామన్నారు. ప్రాంగణ నియామక అధికారి భానుకిరణ్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూలో 28 మంది పీవీకేకే విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరి వార్షికాదాయం రూ.2లక్షలతోపాటు పీఎఫ్, రవాణా సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు రెహానా, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. విత్తనాన్ని ఎన్నుకునే క్రమంలో ఆయా భౌగోళిక వాతావరణ, శీతోష్ణస్థితి పరిస్థితులను అనుసరించి సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని లేదా కృషి విజ్ఞాన కేంద్రాన్ని గానీ, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. వారి సలహా మేరకు విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఎంపికలో నిర్లక్ష్యం వహిస్తే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మంచి నాణ్యత, మొలకెత్తే శక్తి కలిగిన విత్తనాన్ని అధీకృత విత్తన డీలర్ల వద్దే కొనుగోలు చేసుకోవాలన్నారు. ఇలా కొనడం ద్వారా పంటనష్టం జరిగినప్పుడు రైతులు వ్యవసాయ ఉన్నతాధికారులను సంప్రదించి నష్టపరిహారం పొందవచ్చన్నారు. విత్తనాలు ఉన్న సంచులు సరైన సీల్‌తో ధ్రువీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాన్నారు. విత్తన సంచులపై విత్తనరకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసుకున్న తర్వాత మాత్రమే కొనుగోలు చేసుకోవాలన్నారు. విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత అధీకృత డీలర్ నుంచి బిల్లుపై (రశీదు) సంతకం తీసుకోవాలన్నారు. హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించి కొనుగోలు చేయాలన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి

నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేసినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. ట్రస్టు సభ్యులు రామాంజనేయులు, సతీమణి స్వాతి కుమార్తె చైత్ర పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి చేయూత ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, సుబ్బారావు, కిష్టప్ప, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

పవన్ ఆగ్రో ఏజెన్సీ తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు

పట్టణంలోని పారిశ్రామిక వాడలో ఉన్న పవన్ ఆగ్రో ఏజెన్సీని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వేరుశెనగ విత్తననిల్వలు, నాణ్యతను పరిశీలించారు. ముందుగా కార్యాలయంలో వ్యవసాయ అధికారులు ఎఇఒలు, ఎంపిఇఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు ఎరువులు పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్, ఎఇఒ కృష్ణ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి : జనసేన

ప్రజాశక్తి-నార్పల

నార్పల క్రాసింగ్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడిఒ దివాకర్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం సీఎం పర్యటన సందర్భంగా స్పీడ్ బ్రేకర్లను తొలగించి నూతన రోడ్డును వేశారన్నారు. తర్వాత స్పీడు బ్రేకర్లు వేయడం మరచిపోయారన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి స్పీడు బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రాథమిక పాఠశాలల వద్ద కూడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, పొన్నతోట రామయ్య, వినోదం లోకేష్, జనసైనికులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

గుత్తి : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని సహాయ కార్మిక అధికారి రవీంద్రనాథ్, సిడిపిఒ ఢిల్లేశ్వరి, ఎస్ఐ బి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈమేరకు బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కార్మిక శాఖ, ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గుత్తిలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకూ చేరుకుని అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కులు, భవిష్యత్తును నాశనం చేయరాదన్నారు. అన్నిశాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఛైల్డ్‌లైన్ (1098) కోఆర్డినేటర్ బాలాజీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, ప్రియాంక, కృష్ణవేణి, కార్మిక శాఖ సిబ్బంది రాధ, ఛైల్డ్ లైన్ టీం సభ్యులు నాగలక్ష్మి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ పరిశీలన

యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామ పరిధిలో చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని తహశీల్దార్ అలెగ్జాండర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ యాడికి మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో 3,600 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజకుమార్, రాయలచెరువు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

శింగనమల : మండల పరిధిలోని బండిమీదపల్లి గ్రామంలో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎఒ అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023లో భాగంగా జొన్నలు, కొర్రలు, రాగుల సాగు విస్తీర్ణం పెంచే దిశగా వ్యవసాయ శాఖ పని చేయాలని నిర్దేశించిన నేపథ్యంలో డివిజన్ స్థాయి చిరుధాన్యాల సాగు విస్తరణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులుగా ఓబులేసు

ఉరవకొండ : నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులుగా మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామానికి చెందిన బోయ ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పర్యటించి గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు.

మెరుగైన విద్యుత్ ఇవ్వాలని వినతి

బొమ్మనహాల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరుతూ సోమవారం ప్రిన్సిపల్ ఆంజనేయులు ఏఈ లక్ష్మారెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారని, తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంటు, ఫ్యాన్లు, కంప్యూటర్, తదితర అవసరాల కోసం త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఏఈ కొత్తగా విద్యుత్ లైన్ లాగి త్రీ ఫేస్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు ఉన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు

వంట చేస్తున్న ఆందోళనకారులు

నార్పల : మండల కేంద్రంలోని స్థానిక ఇందిరమ్మ కాలనీలో గతంలో ఓబుళమ్మకు తన స్థలాన్ని అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ వామపక్ష, ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితురాలు, బంధువులతో కలిసి వామపక్షాలతోపాటు ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు ఏర్పాటు చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓబుళమ్మకు ఇంటి నిర్మాణం నిమిత్తం రెవెన్యూ అధికారులు బీఫారం పట్టా జారీ చేశారు. అయితే ఆర్థిక కారణాల రీత్యా ఆమె ఇంటిని నిర్మించుకోలేదు. ఈనేపథ్యంలో కొద్ది రోజుల క్రితం సంబంధిత స్థలంలో మరొకరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న ఓబుళమ్మ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించారు. ప్రస్తుతం తిరిగి అదే స్థలంలో ఇతరులు ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో వామపక్ష నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ సురేష్ బాధితుల వద్దకు చేరుకుని పదిరోజుల్లోపు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు మారుతి, కుల్లాయప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు పుల్లప్ప, హనుమంతు, గంగాధర్, చేపల రమణ, బాధితులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ జంగం నల్లమ్మ మృతి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన వైసిపి నాయకురాలు, మాజీ జెడ్పిటిసి జంగం నల్లమ్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. వైసిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నల్లమ్మ జడ్పిటిసిగా పని చేశారు. ఈనేపథ్యంతో ఈమె గత కొద్దిరోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉంది. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. నల్లమ్మ మృతికి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.